గ్రంథాలయం
6039
శ్రీకాకుళం

# ఆధ్యాత్మిక చిన్నకథలు

## 1. దేవుడున్నాడు

చాలా కాలానికి ఇద్దరు మిత్రులు రైల్లో కలుసుకున్నారు. ఆ ఆకస్మిక కలయికకి ఇద్దరూ ఎంతో సంతోషపడ్డారు. ఒకే ఊరికి చెందినవారు కావడంతో వాళ్ళ చిన్నప్పటి విశేషాలు ముచ్చటించుకోసాగారు. అమావాస్య రాత్రుళ్ళు వంతెన మీంచి కాలువలోకి దూకి, నీళ్ళల్లోఈదుతూ కేరింతలు కొట్టడం గుర్తు చేసుకున్నారు. అనుకోకుండా వారి సంభాషణ దేవుడి మీదకు మళ్లింది.

"నువ్వింకా దేవుడున్నాడని నమ్మడం లేదా?" ప్రశ్నించాడు మొదటివాడు.

"లేదు. నీకింకా నా నాస్తికత్వం గుర్తుందన్నమాట. దేవుడసలు వుంటేగా నమ్మడానికి?" నవ్వాడు రెండోవాడు.

"దేవుడున్నాడు." దృఢంగా చెప్పాడు మొదటి మిత్రుడు.

"లేదు. ఉంటే మనకందరికి ఎందుకు కనిపించడు?"

ఆ విషయం మీద ఇద్దరికీ కాసేపు చర్చ జరిగాక చెప్పాడు ఆస్తిక మిత్రుడు.

"నువ్వు రైలు దిగి మీ ఇంటికి వెళ్లేంతదాకా దేవుడున్నాడని నమ్ము చాలు. ఈలోగా దేవుడున్నాడన్న నిదర్శనం నీకు దొరికితే సరే. లేదా నమ్మడం మానెయ్. అంతా ఆయనే చూసుకుంటాడు."

"సరే. రైలు దిగాక మా ఇంటికి వెళ్లేంతదాకానే, ఈ ఒక్కసారికీ నువ్వు చెప్పినట్లు నమ్ముతాను. నిజంగా దేవుడంటూ ఉండి, ఆ సంగతి ఆయన రుజువు చేసుకోదలిస్తే, ఆయనకి నేనిచ్చే తొలి, ఆఖరి అవకాశం ఇదే." చెప్పాడు నాస్తిక మిత్రుడు నవ్వుతూ.

రైలాగింది. నాస్తికుడు స్టేషన్‌లో రైలు దిగుతూంటే చెప్పాడు ఆస్తికుడు.

"దేవుడు మనం సినిమాలలో చూసే దేవుడిలాగా కిరీటాలతో భౌతిక రూపంలో కనబడడు సుమా! తనున్నానని నిదర్శనం మాత్రం ఇస్తాడు. ఇది గుర్తుంచుకో."

ఆ నాస్తికుడు దేవుడున్నాడని తన జీవితంలో మొదటిసారిగా తన ఇంటికి చేరేదాకా స్థిరంగా నమ్మదలచుకున్నాడు.

అది అమావాస్య రాత్రి. చీకటిగా వుంది. తన ఇంటి దారి పట్టాడు. దారిలో కాలువ, వంతెన కనబడ్డాయి. చిన్నప్పటి రోజులు గుర్తుకు వచ్చాయి. కాలువలో ఈది చాలా కాలమైంది. అతనికి ఉత్సాహం కలిగింది. పేంటు,షర్టు విప్పి పక్కనపెట్టి లంగోటీతో వంతెనమీంచి కాలువలోకి దూకబోయాడు. అకస్మాత్తుగా ఆకాశంలో మెరుపు మెరిసింది. ఆ మెరుపు వెలుగులో నీళ్ళు లేకుండా బోసిగా వున్న కాలువ అతనికి కనిపించింది!

అంతే!

అతని గుండె క్షణకాలం జలదరించింది. తను దూకివుంటే చచ్చేవాడు. మబ్బుల్లేని ఆకాశంలో ఆ మెరుపుని ఎవరు మెరిపించారో అతనికి అర్థమైంది. రైలు దిగుతూండగా మిత్రుడు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. రెండు చేతులూ పైకెత్తి, తనని ఆస్తికుడిగా మార్చిన కనబడని ఆ దేవుడికి నమస్కరించి దుస్తులు వేసుకుని ఇంటిదారి పట్టాడతను.